క్లుప్తంగా

విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కాటసాని



కల్లూరు: వైఎస్సార్‌ సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి, దుష్టశక్తులపై దైవ శక్తులు సాధించిన విజయానికి ప్రతీకగా దసరా వేడుకలు నిర్వహించుకుంటున్నామన్నారు. దసరా అందరికీ విజయాలు అందించాలని దుర్గమ్మను ప్రార్థించనున్నట్లు పేర్కొన్నారు.

కొత్తూరులో మాజీ మంత్రి అరుణ పూజలు



డీకే అరుణకు ప్రసాదం అందిస్తున్న దృశ్యం

పాణ్యం: తెలంగాణ రాష్ట్రం బీజేపీ నాయకురాలు, మాజీ మంత్రి డీకె అరుణ ఆదివారం కొత్తూరులో సుబ్రహ్మణ్య స్వామివారికి పూజలు చేశారు. పాలాభిషేకం, మహారుద్రాభిషేకం, మహ మంగళహారతి తదితర పూజలు చేయించారు. ఆలయ చరిత్ర గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ మర్యాదలతో శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో ఈఓ రామక్రిష్ణ, అర్చకులు నారాయణస్వామి, సురేష్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెండి పడగ వితరణ



వెండి పడగను అందిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీ వల్లి సుబ్రహ్మణ్యేశ్వస్వామి వారికి ఆదివానం కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామానికి చెందిన ఎం సిరిబాబు, ఆయన సతిమణి గుణవతి, విరాట్ క్రిష్ణయాదవ్ వెండి పడగ వితరణ చేశారు. 1కెజీ 19గ్రాముల వెండి పడిగెను అందించినట్లు ఈఓ రామక్రిష్ణ చెప్పారు. స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం దాతలను సన్మానించారు.

అదుపు తప్పి హోటల్‌పైకి దూసుకొచ్చిన అంబులెన్స్‌

కోడుమూరు రూరల్ : స్థానిక కోట్ల సర్కిల్‌లో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని ఓ ప్రైవేట్ అంబులెన్స్ అదుపు తప్పి హోటల్‌పైకి దూసుకురావడంతో సురేష్‌తోపాటు మరో వ్యక్తి గాయపడ్డారు. ఈ ప్రమాదంలో హోటల్ ఫర్నీచర్ దెబ్బతినడంతో పాటు, నాలుగు ద్విచక్రవాహనాలు కూడా దెబ్బతిన్నాయి. ప్రమాదమం అనంతరం అంబులెన్స్ డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడు. కోడుమూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

30న బహిరంగ వేలం పాటలు

గడివేముల: మండల పరిధలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శ్రీ దుర్గాభోగేశ్వ క్షేత్రంలోని వివిధ దుకాణాల నిర్వహణకు సంబంధించి ఈనెల 30న వేలంపాటలు నిర్వహిస్తున్నట్లు ఈఓ చంద్రశేఖరరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సంవత్సరం పాటు టెంకాయలు, టీ, మిఠాయిలు విక్రయించుకునేందుకు ఆసక్తి వ్యక్తులు వేలంపాటలో పాల్గొనాలని ఈఓ సూచించారు.

యువకుడి ఆత్మహత్య

కల్లూరు: ఉలిందకొండ పోలీసు స్టేషన్ పరిధిలోని రేమడూరు గ్రామానికి చెందిన బోయ ఆర్ రవికుమార్ (18) కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ నల్లప్ప తెలిపిన వివరాల మేరకు రవికుమార్ మూడేళ్లగా కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. శనివారం రాత్రి భోజనం చేసి కొత్తగా కొనుగోలు చేసిన ఇంట్లో ఒంటరిగా పడుకున్నాడు. ఆదివారం ఉదయం తల్లిదండ్రులు ఇంట్లోకి వెళ్లి చూడగా ఇంటి పైకప్పుకు ఉండే ఇనుప కొక్కికి తాడుతో ఉరి వేసుకున్నాడు. మృతిడి తండ్రి లక్ష్మన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నెరణికి తండాలో కార్డెన్ సెర్చ్

హొళగుంద: ఈ నెల 24న దేవరగట్టులో జరిగే దసరా బన్ని ఉత్సవంలో భాగంగా ఆదివారం ఆలూరు సెబ్ సీఐ ఎర్ర వెంకట్, ఎస్‌ఐ శ్రీనివాసులు, ఆధ్వర్యంలో సిబ్బంది నెరణికి తండా గ్రామంలో సోదాలు నిర్వహించారు. 10 రింగు కర్రలు, 15 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. అనంతరం గ్రామంలో బన్ని ఉత్సవంలో రింగు కర్రలు వాడడం, సారా సేవించి ఉత్సవంలో పాల్గొనడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. విగ్రహాల ఊరేగింపులో అగ్గి కాగడాలను భక్తులపై విసరడం, అల్లర్లకు దిగడం లాంటి పనులు చేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. సంప్రదాయ పద్ధతిలో భక్తిశ్రద్ధలతో పండుగ జరుపుకోవాలని సూచించారు.

శ్రీదుర్గాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

కోడుమూరు రూరల్ : దసరా శరన్నవ రాత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం కోడుమూరులో శ్రీవల్లెలాంబదేవి, శ్రీచౌడేశ్వరీ దేవి, శ్రీకాళికామాతా, శ్రీరాములమ్మ, శ్రీతులజా భవాని, శ్రీఅంబా భవాని దేవాలయాల్లో అమ్మవారు శ్రీదుర్గాదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయా ఆలయాల్లో కొలువైన అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు. శ్రీవల్లెలాంబదేవి అమ్మవారికి ఆదివారం రాత్రి పల్లకీ సేవను భక్తులు ఘనంగా నిర్వహించారు. శ్రీవల్లెలాంబదేవి సన్నిధిలో బట్టల అంగడి మాదన్న కుమారుడు వెంకటేశ్వర్లు, బంగారం అంగడి గోవిందరెడ్డి భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కోడుమూరు జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్ కొత్త బస్టాండ్ ఆవరణలోని ఈశ్వరాలయం, పాత బస్టాండ్‌లోని శ్రీ వాసవి కన్యకపరమేశ్వరి దేవి ఆలయాల్లో కొలువైన అమ్మవార్లు ఆదివారం దుర్గాదేవిలుగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు కుంకుమార్చన, పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహించారు.



కోడుమూరులో శ్రీవల్లెలాంబదేవికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

గూడూరు: దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం పట్టణంలోని అంభభవానీ మాత ఆలయంలో ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో కుంకుమార్చన నిర్వహించారు. మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

మహిషాసురమర్ధినిగా అమ్మవారు

పాణ్యం: దసరా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు మహిషాసుర మర్దిని రూపంలో దర్శమిచ్చారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమ్మవారు, పాణ్యంలోని శ్రీ వాసవి కాన్యకపరమేశ్వరి ఆలయంలో కొలువైన అమ్మవారు మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శమిచ్చారు.

శ్రీదుర్గాదేవి అలంకరణలో వాసవిమాత


గడివేముల: మండల కేంద్రం గడివేములలోని వాసవికన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవిమాత శ్రీదుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి అష్టోత్తర కుంకుమార్చన, మూల మంత్ర హోమం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు.



శ్రీ వాసవి కన్యకపరమేశ్వరి దేవి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



గూడూరు అంభభవానీ మాత ఆలయంలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



వాసవికన్యకా పరమేశ్వరీ ఆలయంలో దుర్గాదేవి అలంకరణలో వాసవీమాత



శ్రీదుర్గా దేవి అలంకరణలో కొలువైన అమ్మవారు



సి.బెళగల్ ఈశ్వరాలయంలో శ్రీ దుర్గాదేవిగా అమ్మవారు



శ్రీ దుర్గాదేవి అలంకరణలో పార్వతీ అమ్మవారు



శ్రీ దుర్గాదేవి అలంకరణలో శ్రీ కన్యకాపరమేశ్వరిదేవి



మహిషాసురమర్ధినిగా కొలువైన అమ్మవారు



మహిషాసురమర్దిని అలంకారంలో అమ్మవారు

కిటకిటలాడిన పండుగ సంత



కోడుమూరులో ప్రజల కొనుగోళ్లతో కిటకిటలాడుతున్న మెయిన్ బజార్

కోడుమూరు రూరల్ : దసరా పండుగ సంతతో పట్టణంలోని వ్యాపార సముదాయాలన్ని ఆదివారం ప్రజలతో కిటకిటలాడాయి. బట్టలు, కూరగాయలు, పూలు, టెంకాయలు, కిరాణా దుకాణాలన్నీ కొనుగోలుదారులతో నిండిపోయాయి. రోడ్లన్ని రద్దీగా మారిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

కర్నూలు (న్యూటౌన్): ప్రతి విద్యార్థి ఇష్టపడి చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా వ్యవసాయ అభివృద్ధి మండలి చైర్మన్ బెల్లం మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా వీర శైవ లింగాయతిరెడ్డి సేవా సమితి కార్యాలయంలో 10వ తరగతి, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థినీ, విద్యార్థులకు నగదు, మెరిట్ అవార్డులు, సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బెల్లం మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత చదువులే లక్ష్యంగా చదువుకుంటే భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవచ్చన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థినీ, విద్యార్థులకు నగదు పారితోషికం, మెరిట్ అవార్డులు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయతిరెడ్డి అధ్యక్షుడు వీరచంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు సోమశేఖర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, నాగ భూషణరెడ్డి, కార్యదర్శి నాగిరెడ్డి, కోశాధికారి ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థికి నగదు, మెరిట్ అవార్డును అందజేస్తున్న దృశ్యం

పోలీస్ స్టేషన్‌లో ఘనంగా ఆయుధ పూజ



గడివేముల పోలీస్‌స్టేషన్‌లో ఆయుధాలకు పూజ నిర్వహిస్తున్న ఎస్‌ఐ,సిబ్బంది



సి.బెళగల్ పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజను నిర్వహిస్తున్న ఎస్‌ఐ పీరయ్య

సి.బెళగల్: మండలంలో పలు ప్రభుత్వ కార్యాలయాలలో ఆదివారం దసరా పండుగను పురష్కరించుకుని ఆయధ పూజలు ఘనంగా నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ పీరయ్య ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఆయుధ పూజ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ తుపాకులు, రికార్డులకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అదేవిధంగా సి.బెళగల్, పోలకల్, కొత్తకోట, గుండ్రేవుల, బురాన్‌దొడ్డి గ్రామాలలోని విద్యుత్ సబ్ స్టేషన్లలో విద్యుత్ అధికారులు సిబ్బందితో కలిసి ఆయుధ పూజను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

గడివేముల: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో దసరా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య సిబ్బందితో కలిసి ఆయుధ పూజ నిర్వహించారు. స్టేషన్‌లోని పిస్టళ్లు, రైఫిళ్లు, వాహనాలకు అర్చకులు సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో ఆయుధ పూజ చేశారు. గణపతి పూజతో పాటు అమ్మవారికి విశేషద్రవ్యాభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సుఖశాంతులతో ఉండాలన్నారు. ఏఎస్‌ఐ సుబ్బరాయుడు, సిబ్బంది చెన్నయ్య, ఇమాం, మధు, నాగార్జునుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికి కృషి

హాలహర్వి: హంద్రీ–నీవా ఆయకట్టు కింద రైతులు సాగుచేసిన పంట పొలాలకు నీటి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, శ్రీనివాసులు అన్నారు. బెల్డోణ, మల్లికార్జునపల్లె పంట పొలాల్లో రైతులకు నీటి సమస్య నెలకొంది. పైన నాన్‌ఆయకట్టు రైతులు మోటార్ల ద్వారా కాలువల్లోని నీటిని తోడేయడంతో కింద ఉన్న ఆయకట్టు రైతులకు నీరు అందడం లేదు. ఈ సమస్యను పరిష్కరించాలని రైతులు వారిని కోరారు. నాయకులు మాట్లాడుతూ ఈ రెండు గ్రామాల రైతులతో మాట్లాడి నీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. హాలహర్వి మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భీమప్పచౌదరి, సర్పంచ్ బాలరాజు ఉన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

దేవనకొండ: నేపాల్ నుంచి వలస వచ్చి స్థానికంగా గుర్కా పనులు చేసుకుంటూ జీవిస్తున్న రానాబహదూర్ భార్య పార్వతి పది రోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందారు. ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకొని మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు కప్పట్రాళ్ల దివాకర్‌నాయుడు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.10వేలు విలుచేసే వంద కేజీల బియ్యం, 10 కేజీల కందిబేడలు, ఐదు కేజీల చెక్కెర, 14 లీటర్ల మంచినూనె, ఇతర సరుకులు అందజేశారు. మృతురాలికి ఐదుగురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు సంతానం. సహకార సొసైటీ సీఈఓ రహంతుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్నయ్యశెట్టి, పల్లెదొడ్డి చంద్రన్న, తిరుమలేష్‌నాయుడు తదితరులు ఉన్నారు.

శుభమస్తు... విజయోస్తు!

- నేడు 'విజయ దశమి'
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శమీ వృక్ష పూజకు ఏర్పాట్లు



కందేరిలో కొలువు దీరిన దుర్గమ్మ

కర్నూలు కల్చరల్: ఆశ్వయుజ శుద్ధ దశమి రోజును విజయ దశమిగా పిలుస్తారు. ఆ రోజు సాయం కాలం ఎవరు శక్తి స్వరూపిణిని ఆరాధిస్తారో వారు చేపట్టే కార్యాల్లో తప్పక విజయం చేకూరుతుందని పండితుల అభిప్రాయం. ఈ పండుగ రోజు చేసే మరో విశేషమైన కార్యం శమీ వృక్షాన్ని పూజించడం. శమీ వృక్షం అంటే జమ్మిచెట్టు. శమి అంటే శత్రువుల్ని, పాపాల్ని నశింప చేసేది అని అర్థం. దశమి రోజు సాయంత్రం శమీ వృక్షం/ సమిధకు ప్రదక్షిణ చేస్తే నవరాత్రుల పూజల్లో ఏవైనా తెలియక చే సే దోషాలు, తప్పులు ఉంటే పోతాయంటారు. ఉమ్మడి జిల్లాలో దసరా వేడుకలు పెద్ద ఎత్తున జరుగుతాయి. కర్నూలు నగరం, నంద్యాలతో పాటు, శ్రీశైలం, మహానంది, ఆదోని, నందవరం, డోన్, నందికొట్కూరు, ఆత్మకూరు, పత్తికొండ, కల్లూరు, తదితర ప్రాంత్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. కర్నూలు పాత నగరంలోని జమ్మిచెట్టు, జిల్లా గో రక్షణశాల, బుధవారపేట త్రీటౌన్ పోలీస్ స్టేషన్ సమీపం, సీక్యాంప్‌లోని టీటీడీ కల్యాణ మండపం ఆవరణ, మెడికల్ కాలేజ్ మైదానం, అశోక్‌నగర్ ఈశ్వర ఆజనేయ స్వామి ఆలయం, పాతనగరం నగరేశ్వరస్వామి ఆలయం, సప్తగిరి నగర్ మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయం, పాత కల్లూరులో శమీ వృక్ష పూజలు ప్రత్యేకంగా నిర్వహిస్తారు.

25న దుర్గా విగ్రహాల నిమజ్జనం

కర్నూలు కల్చరల్: దుర్గా మాత విగ్రహాల నిమజ్జనాన్ని ఈనెల 25వ తేదీన నిర్వహిస్తున్నట్లు మాజీ రాజ్య సభ సభ్యులు, బీజేపీ నేత టీజీ వెంకటేష్ పేర్కొన్నారు. ఆదివారం దుర్గా విగ్రహాల నిమజ్జన ప్రాంతం తుంగ భద్ర నది దుర్గా ఘాట్‌ను ఆయన సందర్శించారు. నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లపై నిమజ్జన కమిటీ సభ్యులతో చర్చించారు. కమిటీ సభ్యులు చల్లా దామోదర్ రెడ్డి, దాశెట్టి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పక్షుల సందర్శనశాల ప్రారంభం



పక్షుల సందర్శన శాలను తిలకిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్): నగరంలోని ఎగ్జిబిషన్ మైదానంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ పక్షుల సందర్శన శాలను ఆదివారం సాయంత్రం కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ సం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఎగ్జిబిషన్ నగర ప్రజలను అకట్టుకుంటుందన్నారు. నిర్వాహకులు చక్కని పక్షుల ఆకారాలు, ఆకృతులను ఏర్పాటు చేశారన్నారు. నిజమైన పక్షులను తలపించే విధంగా అనుభూతి కలుగుతుందన్నారు. గతంలో ఎన్నడు ఇలాంటి ప్రదర్శన శాల చూడలేదన్నారు. పెద్దలకు జైంట్ వీల్, రైల్, జంపింగ్ డాల్ తదితర ఆట వస్తువులు ఏర్పాటు చేశారన్నారు.దీనిని నగర ప్రజలు వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నగర అధ్యక్షురాలు సత్యనారయణమ్మ, స్థానిక కార్పొరేటర్ విజయలక్ష్మి, ఎగ్జిబిషన్ నిర్వాహకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించి సహకరించండి

కర్నూలు(రాజ్‌విహార్): నెలవారి విద్యుత్ బిల్లులు చెల్లించి సంస్థకు సహకరించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు రూరల్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వై. సుబ్బన్న ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. బిల్లుల జారీ ప్రక్రియ ఈ నెల 9వ తేదీలోపు ముగిసిందని, బిల్లులు ఇచ్చినప్పటి నుంచి 15 రోజులు గడువు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

బలిజ, కాపు భవన నిర్మాణం పూర్తి చేయండి

కర్నూలు (టౌన్) : ఆగిపోయిన బలిజ, కాపు భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని బలిజ సంఘీయులు నగర మేయర్ బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌ను వారి స్వగృహాల్లో కలిసి వినతి పత్రాలు అందజేశారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: మండల పరిధిలోని దేవరగట్టులో ఆదివారం స్వామివారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పూజారులు ఆలయంలోని మూల విరాట్‌లకు తెల్లవారుజామున సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళహారతి, నైవేద్య సంతర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించిన పూజారులు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. స్వామివారిని దర్శించుకోవడానికి కర్ణాటక, ఆంధ్రాకు చెందిన భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు

ఆలూరు: హొళగుంద మండలం దేవరగట్టులో కొలువుదీరిన మాళమల్లేశ్వరస్వామి దసరా ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 24న బన్నీ (కర్రల ఉత్సవం)కి తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ బన్ని ఉత్సవంలో పాల్గొనే లక్షలాది మంది భక్తులకు తాగునీరు, విద్యుత్ సదుపాయం, వాహనాలకు ప్రత్యేకంగా పార్కింగ్, మీడియాపాయింట్, 108 అంబులెన్స్ వాహనాలు, అగ్ని మాపక వాహనాలు, వైద్య శిబిరాలు, భక్తులకు భోజన వసతి, ఉన్నతాధికారులకు విడిది తదితర ఏర్పాట్లు పూర్తిచేసినట్లు చెప్పారు. జిల్లా ఉన్నతాధికారులతో చర్చించి ఆ మేరకు సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు భక్తులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకారం అందించాలని కోరారు.